క్లుప్తంగా

నేడు సాయిబాబా ఆలయం సిల్వర్‌జూబ్లీ వేడుకలు

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామంలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయం సిల్వర్ జూబ్లీ వేడుకలు శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు పూజల్లో పాల్గొనాలని కోరారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం


జోగినాయుడు(ఫైల్)

తెర్లాం: మండలంలోని కుసుమూరు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కోడూరు జోగినాయుడు(68) గురువారం మృతి చెందారు. గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న జోగినాయుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. జోగినాయుడు కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. కుసుమూరు మాజీ సర్పంచ్‌గా పని చేసిన జోగినాయుడు లేని లోటు గ్రామానికి, పార్టీకి తీర్చలేనిదన్నారు. ఆయనతో పాటు కుసుమూరు సర్పంచ్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, స్థానిక పార్టీ నాయకులు జోగినాయుడు మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈయనకు భార్య, వివాహితులైన పిల్లలు ఉన్నారు. జోగినాయుడు మృతదేహానికి కుటుంబ సభ్యులు శుక్రవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మొక్కలతోనే మానవాళికి మనుగడ


మొక్కలు నాటుతున్న సీఐ తదితరులు

బొబ్బిలి: ప్రజలు మొక్కలు నాటే కార్యక్రమాలను విరివిగా చేపట్టాలని సీఐ కె.సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని భూ సమేత వేంకటేశ్వరాలయం ఎదురుగా శుక్రవారం మొక్కలను నాటారు. గ్రీన్ బెల్ట్ సొసైటీ సీఈవో ఎస్వీ రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన సీఐ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కేవలం మొక్కల ద్వారానే సాధ్యమన్నారు. గ్రీన్‌బెల్ట్ సభ్యులు, పట్టణ ప్రముఖులైన పుల్లెల శ్రీనివాసరావు, అనిల్ కే సత్యరాజ్, జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనం వినియోగించొద్దు..

వంగర: మండల పరిధి వి.వి.ఆర్.పేటలో అసంపూర్తిగా ఉన్న రైతు భరోసా కేంద్ర భవనాన్ని వినియోగించవద్దని ఆ గ్రామ సర్పంచ్ బత్తిన గురువులు అన్నారు. ఈ మేరకు ఆయన అధికారులకు ఫిర్యాదు చేయడంతో వంగర మండల ఇంజినీరింగ్ అధికారి ప్రభాకరరావు దర్యాప్తు చేశారు. భవనం నిర్మాణ దశలోనే ఉందని, వ్యవసాయ శాఖకు భవనం ఇంకా అప్పగించలేదని, పనులు పెండింగ్‌లో ఉన్నందును భవనాన్ని అప్పగించలేదని ఏఈ తెలిపారు. భవనం పూర్తయ్యేంత వరకు భవనం వినియోగించవద్దని దర్యాప్తు అధికారికి సర్పంచ్‌తో పాటు ప్రజలు వివరించారు.

మడ్డువలసలో చేపల వేట నిషేధం


వంగర వద్ద మత్స్యకారుల బోట్లు పరిశీలిస్తున్న ప్రసాద్

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో చేపలు వేట నిషేధం అమలులో ఉందని రాజాం మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్‌వీవీ ప్రసాద్ అన్నారు. వంగర వద్ద మడ్డువలస రిజర్వాయర్‌లో మత్స్యకారుల బోట్లును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఐదు ఫసలీలకు సంబంధించి లీజు మొత్తం రూ.70లక్షలు వరకు సొసైటీ చెల్లించలేదని, లీజు మొత్తం చెల్లించినంత వరకు చేపల వేట నిషేధం అమలులో ఉంటుందన్నారు. అనంతరం వంగర పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలకు సమాచారం అందించారు.

అన్నదాత నడ్డి విరిచే కేంద్ర ప్రభుత్వ విధానాలు

విజయనగరం ఫోర్ట్: రైతులను నట్టేట ముంచే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తుందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ ధ్వజమెత్తారు. స్థానిక ఎన్‌పీఆర్ భవనలో శుక్రవారం జరిగిన స్వామినాథన్ శత జయంతి సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయించుకోవడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్. స్వామినాథన్ అని కొనియాడారు. పంటలు పండే భూములను కారు చౌకగా కార్పొరేట్లకు కేంద్రం కట్టబెడుతుండగా, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వంత పాడుతుందని ఆరోపించారు.

- అర్బన్ పీహెచ్‌సీల్లో పని చేయని జనరేటర్లు
- అందుబాటులో లేని ఇన్వర్టర్లు
- పని చేయని ఫ్రిజ్‌లు, ఐఎల్‌ఆర్‌లు
- ఇతర పీహెచ్‌సీలకు పరుగులెడుతున్న వైద్య సిబ్బంది
- సొంత డబ్బులుతో టీకాలు, వ్యాక్సిన్‌ల మోత
- ఉద్యోగాలు చేయలేమంటున్న ఏఎన్‌ఎంలు


ఇన్వర్టర్లు లేని ఆదర్శనగర్ పీహెచ్‌సీ

ప్రజారోగ్యం అంటే లెక్కలేదా..!

రాజాం: ప్రజారోగ్యానికి సుస్తి చేసే రోజులు దగ్గరపడుతున్నాయి. ప్రభుత్వ వైద్యంపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కనిపిస్తుంది. పొమ్మనలేక పొగబెట్టే మాదిరిగా ప్రభుత్వ పీహెచ్‌సీల పనితీరును తగ్గించే పనిలో కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు కనిపిస్తుంది. సిబ్బందికి సరిపడే కిట్లు, మందులకు అవసరమైన వస్తు సామగ్రిని అందుబాటులో ఉంచకుండా చేతులెత్తేస్తుంది. కూటమి ప్రభుత్వం ఫ్యామిలీ వైద్యం ఎత్తివేసి, ఇంటింట ఫీవర్ సర్వేను పక్కనపెట్టింది. ఇప్పుడు పీహెచ్‌సీల నిర్వహణలో నిధుల కోత పెట్టి, అందులో పని చేస్తున్న వైద్య సిబ్బందికి ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. ఈ విధానాలతో విసిగిపోతున్న వైద్య సిబ్బంది ఉద్యోగాలు చేయలేక ఆందోళన చెందుతున్నారు.

ఏడాది కాలంగా సాగదీత

రాజాం మున్సిపాల్టీ పరిధిలో గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రెండు అర్బన్ పీహెచ్‌సీలు మంజూరు చేసి రూ.1.60 కోట్లతో భవన నిర్మాణాలు పూర్తి చేసింది. పూర్తి స్థాయిలో రిఫ్రిజేటర్లు సదుపాయం కల్పించి, ఇన్వర్టర్లు మంజూరు చేయించింది. ఇంతలో ఎన్నికలు రావడంతో ఇన్వర్టర్లకు నిధులు విడుదల కాలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి వీటికి గతంలో మంజూరు చేసిన ఇన్వర్టర్లను ఈ ప్రభుత్వం ఇంతవరకూ ఇవ్వలేదు. జనరేటర్లు మంజూరీ లేదు. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఫ్రిజ్‌లు, ఐఎల్‌ఆర్‌లు పని చేయడం లేదు. వ్యాక్సినేషన్ కిట్లు అంతంత మాత్రంగానే ఉండడంతో వాటితోనే ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు కాలం నెట్టుకొస్తున్నారు. స్థానికంగా రెండు పీహెచ్‌సీలు ఉన్నా ఇక్కడ వ్యాక్సిన్‌లు, టీకాలు నిల్వ ఉంచలేకపోవడంతో మండలంలో పాగిరి, బొద్దాం పీహెచ్‌సీలపై ఆధారపడి, అక్కడి నుంచి వ్యాక్సినేషన్‌లు తీసుకొస్తున్నారు.


మూలకు చేరిన ఐఎల్‌ఆర్ కిట్లు

చిన్న పరిష్కారమే..ఐనా జాప్యం

అర్బన్ పీహెచ్‌సీల్లో ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తే ఐఎల్‌ఆర్‌ల పనితీరు ప్రారంభం అవుతుంది. జనరల్ ఫండ్ నుంచి రూ.50 నుంచి 90 వేలు కేటాయిస్తే ఇన్వర్టర్లు కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ఈ రెండు పీహెచ్‌సీలకు జనరల్ ఫండ్ నిధులు ఇవ్వకపోవడం, ఉన్న నిధుల నుంచి వీటి కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో ఈ సమస్య తీవ్రంగా మారింది. ఈ వైద్యసేవలకు అవస్థలు పడుతున్న వైద్య సిబ్బంది ఇదెక్కడి సమస్య దేవుడా.. అంటూ విసుగు చెందుతున్నారు.

చేతి చమురు

రాజాం మున్సిపాల్టీ పరిధిలో 11 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 48 వేల మంది జనాభాకు 11 మంది ఏఎన్‌ఎంలు, 24 మంది ఆశా కార్యకర్తలు వైద్య సేవలు అందిస్తున్నారు. వీరు పట్టణంలోని ఆదర్శ నగర్, బుచ్చింపేట అర్బన్ పీహెచ్‌సీలు నుంచి వ్యాక్సిన్‌లు, టీకాలు తీసుకుని, వార్డుల్లో చిన్నారులకు, బాలింతలకు అందించాల్సి ఉంది. అయితే ఈ పీహెచ్‌సీల్లో ఐఎల్‌ఆర్(ఐస్ లైన్ రిఫ్రిజిరేటర్స్)లు పని చేయడం లేదు. వీటికి అవసరమైన నిరంతర విద్యుత్ సరఫరా సదుపాయం పీహెచ్‌సీల్లో లేదు. జనరేటర్లు లేకపోవడం, ఇన్వర్టర్లు లేకపోవడంతో వీటిని వినియోగించడం లేదు. దీంతో చిన్నారులకు పుట్టిన వెంటనే వేయాల్సిన బీసీజీ వ్యాక్సిన్, పుట్టిన 24 గంటల లోనే వేయాల్సిన హెపటైటిస్ బి టీకా, 25 రోజుల లోపు వేసే ఓరల్ పోలియో వ్యాక్సిన్ (ఓపీవీ), నెలలకు అనుగుణంగా వేయాల్సిన పెంటావాలెంట్ టీకా, న్యూ మోకాకల్ కంజుగేట్ వ్యాక్సిన్(పీసీవీ), మీజిల్స్-రుబెల్లా వ్యాక్సిన్(ఎమ్‌ఆర్) వంటి వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉండడంలేదు. వీటిని పాగిరి పీహెచ్‌సీ నుంచి పట్టణంలోని సచివాలయ ఏఎన్‌ఎంలు తీసుకొస్తున్నారు. అత్యవసర సమయంలో వీటిని వేయాల్సి ఉండడంతో ఆయా రోజుల్లో సొంతంగా డబ్బులు రవాణా నిమిత్తం వెచ్చించి వీటిని తీసుకొచ్చి వేయడంతో పాటు తిరిగి వాటిని ఆయా పీహెచ్‌లకు అందిస్తున్నారు. గత ఏడాదికాలంగా రాజాంలో ఈ తంతు ఇలానే జరుగుతోంది. దీంతో ప్రతీ ఏఎన్‌ఎం నెలకు తన చేతి చమురు రూ.2 వేలకు పైగా వెచ్చించాల్సిన పరిస్థితి వస్తుంది. వీటికి తోడు ఒక్కో దపా పాగిరి పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్ అందుబాటులో లేకపోవడం, అక్కడకు అందుబాటులో రవాణా సదుపాయం లేకపోయే సందర్భాల్లో వీరి కష్టాలు వర్ణాతీతంగా మారుతున్నాయి. దీంతో గతంలో పట్టణంలో సేవలు అందించిన పలురువు ఏఎన్‌ఎంలు ఇతర ప్రాంతాలకు బదిలీ చేసుకున్నారు.

చర్యలు తీసుకుంటాం..

రాజాం అర్బన్ పీహెచ్‌సీల్లో అత్యవసర వ్యాక్సిన్ నిల్వలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తాం. ఐఎల్‌ఆర్‌లు వినియోగంలోకి తీసుకొస్తాం. ఇన్వర్టర్లు ఏర్పాటుకు నిధులు సమకూర్చుతాం. ప్రస్తుతం ఉన్న విద్యుత్ సమస్యను పరిష్కరించే చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు విచారణ బృందాన్ని నియమిస్తాం.

– ఎస్ జీవనరాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి, విజయనగరం.


పాగిరి పీహెచ్‌సీకి వ్యాక్సినేషన్ నిమిత్తం వచ్చిన రాజాం వార్డు సచివాలయ వ్యాక్సిన్ కిట్లు

మోసకారి చంద్రబాబు


చంద్రబాబు మోసాలపై కరపత్రం ద్వారా వివరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం సిటీ: ప్రజలను మోసం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఘనాపాఠి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండల పరిధి ఆగూరు గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ఇచ్చిన హామీలు చేస్తున్న మోసాలపై వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై గ్రామాల్లోకి వస్తున్న నాయకులను నిలదీయాలని అన్నారు. బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు ప్రజలను మోసం చేయడంలో అంతులేని నేర్పరని అన్నారు. సంపద సృష్టించి అభివృద్ధి బాటలో ఆంధ్రప్రదేశ్‌ను నడుపుతామని చెప్పిన చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంపుదలలో అభివృద్ధి సాధించారని తెలిపారు. దీంతో సామాన్య ప్రజలు సైతం విద్యుత్ చార్జీల బాదుడుకు బలౌతున్నారని గుర్తు చేశారు. రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్‌పీటీసీ బండి నర్సింహులు, సర్పంచ్, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ కోనారి అప్పారావు, కల్చరల్ వింగ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి.నరేంద్ర, నక్కెట్ల అప్పలనాయుడు, కోనారి భవానీనాయుడు, నక్కెట్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తి చేయాలి


మాట్లాడుతున్న శంకరరావు

బొబ్బిలి: పట్టణంలోని రామన్నదొరవలస సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శంకరరావు విలేకర్లతో శుక్రవారం మాట్లాడారు. ఇళ్లను పూర్తిగా లబ్ధిదారులకు అప్పగించకపోయినప్పటికీ వారి నుంచి నెలసరి వాయిదాలను బ్యాంకులు వసూలు చేస్తున్నారన్నారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అన్ని సౌకర్యాలను కల్పించి ఇళ్లను అప్పగించాలని కోరుతూ ఈ నెల 11న ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగనున్న ఈ కార్యక్రమానికి లబ్ధిదారులంతా హాజరై జయప్రదం చేయాలన్నారు. ఆయన వెంట యుగంధర్, వాసు తదితరులున్నారు.

చినభీమవరం రోడ్డు ఇంతేనా..!

బాడంగి:

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న చినభీమవరం గ్రామానికి దశాబ్దాలుగా పక్కా రోడ్డు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాలకులు మారినా తమ గ్రామానికి రోడ్డు వేయడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.5లక్షలు డబ్ల్యూబీఎం రోడ్డు మంజూరైనా సకాలంలో పనులు జరగక.. పార్ట్ బిల్లులు అందకపోవడంతో మట్టి, కంకరు, క్రషర్ డస్టు వేసి వదిలేశారు. దీంతో మళ్లీ రోడ్డు యథాస్థితికి చేరుకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత అని చెబుతున్నా.. అవి ఉత్తి మాటలేనని తేలిపోయింది.

మండల కేంద్రానికి దగ్గరగా ఉండడంతో ప్రజల రాకపోకలు నిత్యం కొనసాగిస్తున్నా బాగు చేయాలన్న ఆలోచన కూటమి నేతలకు కలగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి పాలకులు పట్టించుకొని రహదారికి మోక్షం కలిగించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గోతులతో బురదమయమైన చినభీమవరం రోడ్డు


సంతకవిటి: ఉమారామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజలు


వంగర: రుషింగిలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

శ్రావణ శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా జరిగాయి. ఆలయాల్లో జరిగిన పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్


రాజాం సిటీ: నవదుర్గను దర్శించుకునేందుకు క్యూ కట్టిన భక్తులు

అసంపూర్తి నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..!

బొబ్బిలి రూరల్: కొత్త ప్రభుత్వంలో పల్లెపండగ పేరుతో ఉపాధి హామీ నిధుల చేపట్టేందుకు గ్రామాల్లో అనేక పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని సిహెచ్.బొడ్డవలస పంచాయతీలో కొత్తగా రూ.9లక్షలతో చెత్తశుద్ధి కేంద్ర నిర్మాణానికి కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఆరంభంలో నిర్మాణ పనుల్లో జోరు కన్పించింది. అనంతరం ఉపాధిహామీ నిధులు విడుదల నిలిచిపోవడంతో చెత్తశుద్ధి కేంద్రం నిర్మాణం సైతం నిలిచిపోయింది. కాంట్రాక్టర్ ఈ నిర్మాణాన్ని సగం వరకు పూర్తి చేసి చేతులెత్తేశాడు. ఇది ఎప్పటికి పూర్తవుతుందో కూడా తెలియని దుస్థితి. దీంతో గ్రామంలో సేకరిస్తున్న చెత్తను పారిశుధ్య కార్మికులు ఊరు బయట కాల్చివేస్తున్నారు. దీనిపై ఉపాధి పథకం ఏపీవో లక్ష్మీపతిరాజును వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు బిల్లులు నిలిచిపోవడంతో పనులు నిలిపివేసినట్టు తెలిపారు.


సగంలో నిలిచిపోయిన చెత్తశుద్ధి కేంద్ర నిర్మాణం

ఆడ పిల్లల సంరక్షణ సమాజ బాధ్యత


గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు

బొబ్బిలి: ఆడపిల్లల రక్షణ సమాజంలో ఉన్న మనందరి బాధ్యతని ఎస్‌టీవో పీవీ పద్మనాభం, రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు అన్నారు. కారుణ్య ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రాఖీ పౌర్ణమి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న బాలికలచే రాఖీలు కట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులందరికీ మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఘాయిత్యాలు అరికట్టినప్పుడే రక్షాబంధన్‌కు సార్థకత అని అన్నారు. రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు సింద్రీ శ్రీనివాసన్, సభ్యులు జయప్రకాష్, ఇవాంజిలిన్, ఆశ్రమ పాఠశాల బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ బంధానికి ప్రతీక రాఖీ



- నేడు రాఖీ పౌర్ణమి

రాజాం సిటీ: అన్నాచెల్లెళ్లు.. అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమ... ఆత్మీయతకు చిహ్నంగా జరుపుకునే పండగ రక్షాబంధనం. రక్త సంబంధీకులు లేకున్నా మనకోసం అండగా నిలిచే ఆప్తుల్ని సమాజం అందిస్తుంది. అలాంటి వారికి రాఖీ కట్టి సోదర భావాన్ని పెంపొందించుకునేందుకు రాఖీ పౌర్ణమి మంచి సందర్భం. ఆడపడుచుకు నేనున్నానని సోదరుడు కల్పించే భరోసాకు ప్రతీక రాఖీ పౌర్ణమి. ఈ నెల 9న రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీలు కొనుగోలు చేసేందుకు యువతులు పట్టణాల్లోని రాఖీ షాపుల వద్ద శుక్రవారం సందడి చేశారు.

అందుబాటులో పలు రకాల రాఖీలు, గిఫ్ట్ ప్యాక్‌లు

కులాలు, మతాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా జరుపుకునే ఆత్మీయ పండగ రాఖీ పౌర్ణమి. అక్క, చెల్లెలు తమ సోదరుడుకి రాఖీ కట్టి తిలకం దిద్దిన తరువాత వారికి బహుమానం ఇవ్వడం ఆనవాయితీ. పూర్వం డబ్బులు, నగలు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పద్ధతి ఉన్నా వాటితో పాటు స్వీట్స్ డ్రై ఫ్రూట్స్, చాక్లెట్స్ గిఫ్ట్‌గా ఇస్తున్నారు. అందుకోసం స్వీట్స్ షాపు నిర్వాహకులు రకరకాల గిఫ్ట్ ప్యాక్‌లు సిద్ధం చేస్తున్నారు. అలాగే దుకాణాల్లో పలు రకాల రాఖీలను విక్రయదారులు అందుబాటులో ఉంచారు.


గోతులమయమైన కుసుమూరు - నందిగాం బీటీ రోడ్డు


అధ్వానంగా ఉన్న కుసుమూరు - అంపావల్లి బీటీ రోడ్డు

బీటీ రోడ్లు సాగసు చూడతరమా..!

తెర్లాం మండలం కుసుమూరు నుంచి నందిగాం బీటీ రోడ్డు, కుసుమూరు నుంచి అంపావల్లి బీటీ రోడ్డు అధ్వానంగా తయారయ్యాయి. చినుకు చిత్తడిగా మారి పాదచారులు సైతం వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. బీటీ రోడ్లు అయినా మట్టి రోడ్ల కంటే అధ్వానంగా ఉండడం, రోడ్డంతా గోతులమయం కావడంతో కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– తెర్లాం

